పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీ శ్రీనగర్ కాలనీలో గల రేగులకుంట చెరువు సుందరీకరణలో భాగంగా చెరువు కట్టపై కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఫౌండేషన్ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం వాటికి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సేల్స్ ఫోర్స్ ఐటీ సంస్థల ప్రతినిధులు, ఫౌండేషన్ సభ్యుల కృషితో రేగుల కుంట చెరువు దశ మారిందని తెలిపారు. మురుగు కూపం లాంటి చెరువును స్వచ్ఛమైన చెరువుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చైతన్య, రాము, కాంగ్రెస్ నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, కాలనీ వాసులు, సీతారామయ్య, పూర్ణ, మంగపతి, రామారావు, చంద్రశేఖర్, రాజారావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీ రాజీనామా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్

- అనర్హత వేటు కోసం కోర్టుకు వెళ్తాం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి కుమార్ యాదవ్

గచ్చిబౌలి: బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మసీద్‌బండ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో నియోజకవర్గాన్ని 10 వేల కోట్లతో అభివృద్ధి చేశానని చెప్పిన ఆయన మళ్లీ అభివృద్ధి కోసం పార్టీ మారుతున్నట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ఎన్ని నిధులు తెచ్చారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపుపై హైకోర్టు, సుప్రీం కోర్టుకు వెళ్లి అనర్హత వేటు పడేలా పోరాటం చేస్తానన్నారు. అనంతరం బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్ర రావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గాంధీ చేసిన తప్పులను కప్పి పుచ్చుకోవడానికే పార్టీ మారారని ఎద్దేవా చేశారు. సమావేశంలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వేణు, మాజీ కార్పొరేటర్ నవతా రెడ్డి, రాధాకృష్ణ, ఎల్లేష్, ఆంజనేయులు, వెంకటస్వామి రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, పద్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఊరపోచమ్మకు ప్రత్యేక పూజలు





అమ్మవారిని దర్శించుకున్న బస్తీవాసులు

రాయదుర్గం: రాయదుర్గంలోని ఊరపోచమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల పర్యవేక్షణలో అర్చకులు సంతోష్ మిశ్రా ఆధ్వర్యంలో అర్చనలు, పూజలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆషాఢ మాసంలో ప్రతి రోజూ సాధారణ పూజలు ఉదయం, సాయంత్రం జరుగుతాయని, ఆదివారం, మంగళవారం, శుక్రవారం ప్రత్యేక పూజలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. బస్తీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గణేష్, నరేష్, సంజీవ, రాజు, యువరాజు, నర్సింహ్మారావు, శ్రీనివాస్, విజయ్, త్రినాథ్, శ్రీకాంత్, మహేష్, బస్తీవాసులు పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

కూకట్‌పల్లి: సామాజిక స్పృహతో యువత మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు శివ చౌదరి, బచ్చు మల్లి, బాబ్జి ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని బండి రమేష్ ప్రారంభించారు. గామన్, నెక్స్‌జెన్ హాస్పిటల్స్ సౌజన్యంతో వైద్యులు షుగర్, బీపీ, సాధారణ వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. నిర్వాహకులు, వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు శేరి సతీష్‌రెడ్డి, లక్ష్మణ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సాదు ప్రతాప్‌రెడ్డి, రేష్మ, సుధ తదితరులు పాల్గొన్నారు.

ధరణినగర్ సమస్యలు పరిష్కరిస్తాం

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ధరణినగర్‌లో డ్రైనేజీ, రోడ్లకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆదివారం పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వర్షానికి కూడా ముంపునకు గురయ్యే కాలనీని నేడు ఎంతో అభివృద్ధి చేశామని ఆయన గుర్తు చేశారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్లను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, సీహెచ్. భాస్కర్, అగ్రవాసు, మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, రెహమాన్, ప్రేమ్ దాస్, బాలస్వామి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ పోచమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 28న జరిగే ఉత్సవాల్లో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనున్నట్లు ఆలయ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు ఉత్సవాల ఏర్పాట్లపై ఆదివారం ఉదయం ఆలయ కమిటీ సమావేశమయ్యారు. బోనాల ఉత్సవాలు ఉదయం 6 గంటలకు అభిషేకంతో మొదలై రాత్రి ఘటాల ఊరేగింపుతో ముగుస్తుందని కమిటీ వెల్లడించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బోనాల ఉత్సవాల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

రాజేంద్రనగర్ రాజకీయాల్లోకి కార్తీక్‌రెడ్డి

- బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు
- పార్టీ నాయకులతో స్పష్టం చేసిన కేటీఆర్



బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్ రెడ్డి

మణికొండ: రాజేంద్రనగర్ రాజకీయాల్లోకి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి రంగ ప్రవేశం చేయనున్నారు. మాజీ మంత్రి పి.సబితారెడ్డి తనయుడిగా, గతంలో చేవెళ్ల పార్లమెంట్ నుంచి ఎంపీగా పోటీ చేసిన కార్తీక్‌రెడ్డికి రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ బాధ్యతలను అప్పగించే దిశగా అడుగులు వేస్తున్నట్టు పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనతో పాటు వెళ్లిపోయారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ కేడర్, అభిమానులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గంలో నష్ట నివారణ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా గుర్తింపు, పరిచయాలు, కేడర్ ఉన్న కార్తీక్‌రెడ్డిని రంగంలోకి దించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. గతంలో ఉమ్మడి చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంగా ఉన్న సమయంలో ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన సబితారెడ్డి, ఇంద్రారెడ్డి కుటుంబానికి అటు చేవెళ్ల, ఇటు రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున అభిమానులు, కేడర్ ఉంది. సబితారెడ్డి మహేశ్వరం నియోజకవర్గానికి మారిన తర్వాత రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మంత్రిగా తప్ప మిగతా కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనలేదు. దాంతో కొంత కేడర్ ఇతరుల వైపు మళ్లినా తిరిగి వారు రంగంలోకి దిగితే వారి వెంట నడిచేందుకు బీఆర్ఎస్ పార్టీలో మిగిలిపోయిన కేడర్ సిద్ధంగా ఉంది. ఆదివారం మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన మణికొండ నాయకులతో త్వరలోనే పార్టీని సంస్థాగతంగా పూర్తి స్థాయిలో మార్పులు చేస్తామని, పార్టీ మారిన ఎమ్మెల్యే స్థానాల్లో వారిని ధీటుగా ఎదుర్కొనే నాయకులను రంగంలోకి దించుతామని స్పష్టం చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. అందులో భాగంగానే ఎప్పటినుంచో రాజేంద్రనగర్ నియోజకవర్గంపై కన్ను వేసిన కార్తీక్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలనే దిశగా సంకేతాలు ఇచ్చినట్టు తెలిసింది.



జాప్యమెందుకు?

నెలలుగా ముందుకు సాగని పనులు

- రోడ్ల మూసివేతతో రాకపోకలు బంద్
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, కాలనీ వాసులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి అండర్‌బ్రిడ్జి కింద ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వరద నీరు భారీ ఎత్తున నిలుస్తుంది. ఇలా నిలవడం సర్వ సాధారణంగా మారింది. దీంతో రూ.4 కోట్ల వ్యయంతో జీహెచ్‌ఎంసీ బాక్స్‌టైప్ డ్రెయిన్, కల్వర్టు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. అనంతరం డ్రెయిన్ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. పనుల కోసం రోడ్డు మూసివేయడంతో వాహనదారులు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరితగతిన పూర్తి చేస్తే స్థానికులకు ఎంతో మేలు చేకూరుతుంది.

మూడున్నర నెలలుగా ఇదే పరిస్థితి

◆ లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బాక్స్ టైప్ కల్వర్టు పనుల్లో భాగంగా బాక్స్ టైప్ డ్రెయిన్‌ను నిర్మిస్తున్నారు. పనుల్లో జాప్యంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

◆ బాక్స్ టైప్ డ్రెయిన్ నిర్మాణ పనుల్లో భాగంగా సిటిజన్ కాలనీలోకి వెళ్లే మార్గాన్ని మూడున్నర నెలలుగా మూసి వేశారు. దీంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించలేకపోతున్నారు.

◆ బాక్స్ టైప్ పనుల్లో భాగంగా పాత డ్రెయిన్‌పై ఉన్న శ్లాబ్‌ను కట్ చేసి పూడిక తీశారు. అనంతరం సదరు డ్రెయిన్‌పై సి క్యాస్టింగ్ కవర్స్ వేసి జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు చేతులు దులుపుకున్నారు.

◆ సిటిజన్ కాలనీకి వెళ్లే మార్గంలో కల్వర్టు పనులను చేపట్టాల్సి ఉంది. ఆయా పనులు పూర్తి చేసి మార్గం సుగుమం చేయాలని కాలనీ వాసులు, వాహనదారులు కోరుతున్నారు.

పనులు పూర్తయ్యేనా?

బాక్స్ టైప్ కల్వర్టు పనులు మూడు దశల్లో స్లాబ్ వర్క్‌ను పూర్తి చేశారు. బాక్స్ టైప్ డ్రెయిన్ నిర్మాణ పనులు మిగిలి ఉన్నాయి. వాటిని కూడా వర్షాకాలం ఆరంభం కాక ముందే పూర్తి చేస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. అక్కడ పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద కల్వర్టు, డ్రెయిన్ నిర్మాణాన్ని తర్వగా పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో మూసి ఉన్న సిటిజన్ కాలనీలోకి వెళ్లే రోడ్డు

ఎంపీ రఘునందన్‌రావును కలిసిన నేతలు



రాయదుర్గం: బీజేపీ ఎంపీ రఘునందన్‌రావును మర్యాదపూర్వకంగా పలువురు బీజేపీ నాయకులు ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు విజయ్‌కుమార్, రామచంద్ర, గచ్చిబౌలి డివిజన్‌కు చెందిన జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు హన్మంతునాయక్ పాల్గొన్నారు.



మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన ఆదివారం ఆకట్టుకుంది. అరణ్య నరైన్ ఫ్లూట్‌ఎంఫిట్ అకాడమీ బెంగుళూరుకు చెందిన కళాకారులు నాట్యాన్ని ప్రదర్శించారు. ఇందులో విష్ణుకౌతం, శ్రీవల్లీ, మాధెయ్ మల్లైధ్వజ. చూడరేయ్, ప్రదోషకృతి, రంజనిమల, శివస్తుతి తదితర అంశాలను ప్రదర్శించారు. - మాదాపూర్

ప్రత్యేక పూజలు..



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీబీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వాతినక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు భార్గవ లక్ష్మీనరసింహస్వామి తెలిపారు. సోమవారం ఉదయం శ్రీలక్ష్మీనరసింహస్వామికి ఫల పంచామృత అభిషేకం, శ్రీహోమం, రాత్రి 7గంటలకు కల్యాణమహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఎమ్మెల్యేను వివేకానందగర్‌కాలనీ వాకింగ్ గ్రూప్ సభ్యులు, కాలనీ వాసులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గ అభివృద్ధికి బాసటగా నిలవాలన్నదే తన లక్ష్యం అని అన్నారు. నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల కోరిక మేరకు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణారావు, కట్ట శ్రీనివాస్, కొండారెడ్డి, స్వరాజ్యం, బాలాజీ, సాయిప్రసాద్, ప్రకాష్, సుధాకర్‌రెడ్డి, సతీష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

జోరు వర్షం

శేరిలింగంపల్లి: వర్షం కురవడంతో రోడ్లపైకి వరద నీరు వచ్చి చేరింది. ఆదివారం సాయంత్రం శేరిలింగంపల్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో అరగంట పాటు లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద వరద నీరు చేరడంతో వాహనాలను దారి మళ్లించారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది రంగంలోకి దిగి వరదనీటిని నాలాలోకి వెళ్లేలా చేశారు. అనంతరం వాహనాల రాకపోకలు సాగాయి.

చికిత్స పొందుతూ మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గత నెల 30న గుర్తు తెలియని వ్యక్తి మూర్ఛతో పడిపోతే స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆ సమాచారం తెలుసుకున్న పోలీసులు అతనికి సంబంధించిన వారు ఉంటే తమను సంప్రదించాలని పోలీసులు ప్రకటించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న ఆ గుర్తుతెలియని వ్యక్తి శనివారం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే తమను సంప్రదించాలని పోలీసులు కోరారు.

కొనసాగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు

రాజేంద్రనగర్: బుద్వేల్ కోట మైసమ్మ ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం సామూహిక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కోట మైసమ్మ తల్లి దేవాలయ ప్రధాన అర్చకులు సందీప్ శర్మ, వీరభద్ర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు వేద పండితులు రామక్రిష్ణ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. వందలాది మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హిమాయత్‌నగర్: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి వ్యక్తి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కాంగ్రెస్ నేత రామన్‌గౌడ్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్ డివిజన్‌లోని మేల్కోటి పార్క్‌లో అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని రామన్‌గౌడ్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్ష, దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అగర్వాల్ హాస్పిటల్‌లో ఉచిత కన్సల్టేషన్ అవకాశం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎంఎస్ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

బంజారాహిల్స్: పేద విద్యార్థులకు ఎంఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ అన్నారు. ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతి సంవత్సరం వెయ్యి మంది విద్యార్థులకు కోటి రూపాయల ఆర్థిక సహాయం అందిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో 300 మంది పేద విద్యార్థులకు వారి చదువు నిమిత్తం ఆర్థిక సహాయ కింద చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కుంభం అనిల్‌కుమార్ మాట్లాడుతూ నిరుపేదలకు చేయూతనందించి ఎంఎస్ఆర్ ట్రస్ట్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు శివారెడ్డి, శిరీషారెడ్డిలు మాట్లాడుతూ భగవంతుడు తనకు నలుగురికి సహాయం చేసే అదృష్టం కలిగించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో మంచి మార్కులు సాధించిన పేద విద్యార్థులకు రూ.10,000 చొప్పున ఆర్థికంగా చేయూతనందించడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి ఉచిత వైద్యం, పేదల ఆకలి తీర్చడం, పేదలకు సాయం అందించడమే ఎంఎస్ఆర్ ట్రస్ట్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జీవీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కష్టాన్ని గుర్తించాలి



మున్సిపల్ కార్మికులను సన్మానించిన వైస్ చైర్మన్, కమిషనర్

మణికొండ: ప్రతినిత్యం మన కాలనీలు, వార్డులను పరిశుభ్రం చేయడంతో పాటు మురుగునీరు పోయేలా, వీధి దీపాలు వెలిగేలా అనుదినం కృషి చేస్తున్న మున్సిపల్ కార్మికుల కష్టాన్ని గుర్తించాలని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు ఆదివారం. భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ఎన్విరాన్‌మెంటల్ కన్వీనర్ రఘుసతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మున్సిపాలిటీలో పనిచేస్తున్న 270 మంది కార్మికులను శాలువాలతో సన్మానించారు. ఏబీసీఎస్‌పీ అధ్యక్షుడు రామానుజ, ఏబీసీబీసీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, కౌన్సిలర్‌లు శ్రీకాంత్‌స్వామి, పి.శైలజ, కోఆప్షన్ సభ్యులు, బీజేపీ నాయకులు, కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ ప్రభావతిలతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

4న వివేకానందనగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్ కమిటీ హాలులో సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షులు రోణంకి జగన్నాథం మాట్లాడుతూ..ఆగస్టు 4న ఉదయం 6:30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారని తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తారని, 20న నామినేషన్ ఉపసంహరణ, 29న పోటీ చేసే అభ్యర్థుల ఓటర్ లిస్టును సిద్ధం చేయటం జరుగుతుందన్నారు. ఆగస్టు 2వ తేదీ వరకు ప్రచారం నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల అధికారిగా సామ కొండల్ రెడ్డి, సహాధికారులుగా పి. రామచంద్రారెడ్డి, నాగిరెడ్డి, అప్పారావులను నియమించామని తెలిపారు. సమావేశంలో పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్, కాయితి యాదవ్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, బుల్లి శ్రీను, చెవ్వూరి మధుసూదనాచారి, చిలుకల కృష్ణారెడ్డి, చెల్లయ్య, బొంత హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టీఎన్‌జీఓ కాలనీ ప్రతినిధులు



రాయదుర్గం: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని గచ్చిబౌలిలోని రంగారెడ్డి జిల్లా టీఎన్‌జీఓ గవర్నమెంట్ ఎంప్లాయిస్ హౌజింగ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రోడ్ల నిర్మాణం, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ) ఏర్పాటుపై వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి జంగయ్య తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, సభ్యులు రాములు, భాస్కర్, జోగారావు, గోపాల్, భాస్కర్‌రావు, శ్రావణ్, అశ్రఫ్, నర్సింహులు, గోపాల్ పాల్గొన్నారు.

పార్టీ పరిస్థితిపై కేటీఆర్‌తో చర్చించిన నేతలు



కేటీఆర్‌తో నియోజకర్గం, ఇతర ప్రాంతాలకు చెందిన నాయకులు

రాయదుర్గం: బీఆర్ఎస్ శేరిలింగంపల్లి నాయకులు పలువురు ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఎమ్మెల్యే గాంధీ పార్టీ మారిన నేపథ్యంలో నగరంలోని ఆయన నివాసంలో కలిసి పార్టీ స్థితిగతులపై చర్చించారు. పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన కార్యక్రమాలపై కార్యకర్తలకు కేటీఆర్ వివరించారు. పార్టీ కష్టకాలంలో ఉన్న కార్యకర్తలకు భవిష్యత్‌లో తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

23న మధురా నగర్‌లో బోనాలు



సమావేశంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

రాయదుర్గం: మధురానగర్‌లోని ఎదురుగడ్డ మైసమ్మ ఆలయ బోనాల వేడుకను ఈనెల 23న నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. ఆలయ కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎదురుగడ్డ మైసమ్మతోపాటు పోచమ్మ, ఎల్లమ్మ అమ్మవార్ల బోనాలను కూడా అదే రోజున నిర్వహించేందుకు కమిటీ సమావేశంలో తీర్మానించారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్, రమేష్‌గౌడ్, ఎస్ శంకర్, గోవింద్, సాయిలు, నర్సింహ్మా, సంగు, రాకేష్, సాగర్, మహేష్, అవినాష్, సంతోష్, ఆలయ అర్చకుడు లక్ష్మణ్‌మూర్తి పాల్గొన్నారు.

29న బోనాల పండుగ

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్ చెరు: డివిజన్ పరిధిలో 29న బోనాల పండుగ నిర్వహించేందుకు నిర్ణయించినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం కోదండ సీతారామస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రముఖుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బోనాల పండుగను పురస్కరించుకొని డివిజన్ పరిధిలోని అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. భక్తులకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో బోనాల పండుగను నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం

పటాన్‌చెరు టౌన్: పట్టణంలో కురిసిన ఈదురు గాలుల వర్షానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఆదివారం సాయంత్రం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీ, చైతన్య స్కూల్ సమీపంలో కరెంటు తీగలపై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో 45 నిమిషాల పాటు సేపు విద్యుత్ నిలిచిపోయింది. అధికారులు చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కార్మికుల పాదయాత్ర

పటాన్‌చెరు టౌన్: మాజీ ఎమ్మెల్సీ టీపీసీసీ ఉపాధ్యక్షుడు రాముల నాయక్‌కు కార్మికశాఖ మంత్రి పదవిని ఇవ్వాలని సువిన్ యూనియన్ తరఫున కార్మికులు పాదయాత్ర నిర్వహించారు. ఆదివారం స్థానిక మహంకాళి అమ్మవారికి ఆ యూనియన్ నాయకులు, కార్మికులు ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రగా గణేశ్ గడ్డ దేవస్థానానికి బయలుదేరారు. యూనియన్ నాయకులు సత్యనారాయణ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రాము పాల్గొన్నారు.

కంకర క్రషర్‌ల నివారణ కోసం జేఏసీ

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామ శివారులోని కంకర క్రషర్‌లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఈ క్రషర్‌లను ఇక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు తీర్మానించారు. అందుకు సంబంధించిన జేఏసీని మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చైర్మన్‌గా విజయ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా ఆరేందర్‌గౌడ్, భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా రమణసింగ్, అనిల్‌కుమార్, కోశాధికారులుగా మహేందర్‌గౌడ్, గణేశ్, సలహాదారులుగా మహస్తష్, వీరేశ్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. గ్రామంలోని ప్రజలందరి సలహాలు తీసుకుంటూ కమిటీ ముందుకు సాగుతుందని చైర్మన్ విజయ్‌గౌడ్ తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462